క్లుప్తంగా

1న దుర్గమాంబ పండగ


గ్రామ దేవత దుర్గమాంబ

పరవాడ: స్థానికంగా కొలువైన శ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగను పైల వారి కుటుంబ సభ్యులు జూన్ 1న వైభవంగా నిర్వహించనున్నారు. పండగ సన్నాహాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి పుట్టుక కార్యక్రమం సందర్భంగా పెద్దింటి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం నుంచి అమ్మవారి ఘటాలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించి, చివరి రోజు అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు


కూలిన చెట్టును తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు

పరవాడ: కలపాక శివారు గొల్లలపాలెంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు ఓ తాడి చెట్టు విద్యుత్ తీగలపై పడి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సమాచారాన్ని తెలుసుకుని అక్కడకు చేరుకున్న ఈపీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు నుంచి వైర్లను తప్పించి, విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. అయితే గాలిలో తేలుతున్నట్టున్న తాడి చెట్టును మాత్రం అలాగే వదిలేశారు. దీంతో ఏ క్షణం ఎవరి మీద పడుతుందోనన్న భయంతో గ్రామస్తులో తాడి చెట్టును తొలగించి ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించడంలో జాప్యం చేసిన అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 1902 నంబర్ ద్వారా జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సింహాచలం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అడవివరం గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం తెలిపారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో గురువారం విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్ బి.బి.రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్‌లో మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, పాఠకులు రేష్మ, భానుమూర్తి, మోహన్, చైతన్య, వర, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారువారం పండగ


బంగారమ్మ, కుంచాలమ్మ సన్నిధిలో సీఐ రంగనాథం, గ్రామస్తులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని జోడుగుళ్ల వద్ద కొలువుదీరిన గ్రామ దేవతలు బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల మారువారం పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు బారులుతీరి అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక సిఐ పైడి రంగనాథం అమ్మవార్లను దర్శించుకుని మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, జోడుగుళ్ల యువత పాల్గొని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జ్ఞానం గొప్ప సంపద

మల్కాపురం: జ్ఞానం గొప్ప సంపదని, దాన్ని ఎవరూ దొంగిలించలేరని ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం జిల్లా అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖనం, జీకే, ఇంగ్లిష్, తెలుగు పదాలు, కాగితాలతో వివిధ ఆకృతుల తయారీపై వారం రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. గురువారం జనరల్ నాలెడ్జికి సంబంధించి పలు అంశాలను వివరించారు.

వైఎస్సార్ పశు బీమా..
పాడి రైతుకు ధీమా

- పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివారావు



సాక్షి ఇంటర్వ్యూ

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తోంది. కొత్తగా వైఎస్సార్ పశు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా పథకం ప్రయోజనాలు, దరఖాస్తు ఎలా చేసుకోవాలి, తదితర వివరాలను పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివారావు 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ప్రశ్న : వైఎస్సార్ పశు బీమా పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టారా?

ఏడీ : వైఎస్సార్ పశు బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తోంది. గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం కంటే పాడి రైతుకు మరింత మేలు కలిగేలా ఈ పథకాన్ని రూపొందించారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) కింద దీన్ని అమలు చేస్తున్నారు.

ప్రశ్న : పాడి రైతుకు కలిగే ప్రయోజనాలేమిటి?

ఏడీ : ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఈ పథకం వర్తిస్తుంది. పాడి రైతులకు ఇది బాగా మేలు చేస్తుంది. ప్రమాదం వల్ల గానీ, సాధారణంగా గానీ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు చనిపోతే వాటికి నష్ట పరిహారం బీమా సంస్థ అందిస్తుంది. దీని కోసం ఆవు, గేదెకు రూ.30 వేలు, గొర్రె, మేకకు రూ.6 వేలు నష్ట పరిహారం అందుతుంది.

ప్రశ్న : బీమా ఎన్ని పశువులకు వర్తిస్తుంది?

ఏడీ : పాడి రైతులు తమ వద్ద పశువులకు బీమా చేయించుకోవాలి. ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఆవులు, గేదెలకు బీమా వర్తిస్తుంది. 50 గొర్రెలు, మేకల వరకు బీమా చేసుకోవచ్చు.

ప్రశ్న : బీమా చెల్లింపులెలా?

ఏడీ : రైతు తరపున బీమా ప్రీమియాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 80 శాతం వరకు చెల్లిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 40 శాతం చెల్లించగా రైతు 20 శాతం మాత్రమే చెల్లించాలి. ప్రీమియం కాల పరిధి మూడు సంవత్సరాలు. బిలో పావర్టీ లైన్(బీపీఎల్), ఎస్సీ, ఎస్టీలు రూ.384 చెల్లించాలి. ఎబౌ పావర్టీ లైన్(ఏపీఎల్) గల పాడి రైతులకు రాష్ట్రం 25 శాతం, కేంద్రం 25 శాతం రాయితీ కలిస్తున్నాయి. రైతు చెల్లించాల్సింది 50 శాతం అంటే రూ.920 చెల్లించాల్సి ఉంటుంది.

ప్రశ్న : చినగదిలి మండలం(రూరల్)లో ఎన్ని పశువులు ఉన్నాయి?

ఏడీ : చినగదిలి(రూరల్) మండలలో 2,780 పశువులున్నాయి. వాటిలో 1,587 ఆవులు, 1,193 గేదెలు ఉన్నాయి. వాటన్నింటికీ రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పుడు బీమా కోసం రైతులు వాటికి రిజిస్ట్రేషన్ చేయించుకుని, పాలసీ తీసుకోవాలి. ప్రభుత్వం కల్పించిన సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రశ్న : పశువులకు ఎంత వయసు ఉండాలి?

ఏడీ : ఆవులు, గేదెలు కనీసం ఒకసారి ఈని(దూడను కనాలి) ఉండాలి. వాటికి ఏడాదిన్నర వయసు నుంచి 10 సంవత్సరాలు వయసు మధ్యలో ఉండాలి. గొర్రెలు, మేకలకు ఆరు నెలలు వయసు దాటాలి.

ప్రశ్న : ఎప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు చేస్తారు?

ఏడీ : ఈ నెల 22వ తేదీ నుంచి బీమా కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం. పాడి రైతులు తమ పశువులకు బీమా చేయించుకోవచ్చు. నిబంధనల ప్రకారం పశువు చనిపోయిన 25 రోజుల్లో పరిహారం అందుతుంది. వైఎస్సార్ పశు బీమాతో రైతులు ధీమాగా ఉండడానికి ఆస్కారం కలుగుతుంది.


ఆవుకు ట్యాగ్ వేస్తున్న సిబ్బంది


ప్రశ్న : సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

ఏడీ : పాడి పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఇప్పటికే టీకాలు వేశాం. రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గొర్రెలు, మేకలకు చిటిక వ్యాధి రాకుండా ప్రస్తుతం టీకాలు వేస్తున్నాం. చినగదిలి, ఎండాడ, మధురవాడ, అడవివరం, రుషికొండ తదితర ప్రాంతాల్లోని పశువులకు ఎక్కువగా టీకాలు వేశాం.

ప్రశ్న : వేసవి ఎండలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏడీ : ప్రస్తుతం వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నాయి. వాటి నుంచి పాడి పశువులను కాపాడుకోవడానికి రైతులు జాగ్రత్తలు పాటించాలి. ఎండలో మేతకు విడిచిపెట్టకూడదు. ఆహారం పగటి సమయం కంటే రాత్రులు ఎక్కువగా ఇవ్వాలి. ఎక్కువగా చల్లని నీరు అందించాలి. చల్లని ప్రదేశాలలో ఉంచాలి. పగటి పూట మేత ఎక్కువగా తింటే వాటి శరీరం లోపల ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగులుతుంది. అందుకే రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


అప్పన్న ఉత్సవమూర్తులకు స్వర్ణపుష్పార్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామ పూజ జరిపారు. విశేషంగా హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ అప్పలనాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంచేయజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు


రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ

పరవాడ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మీశ్రీనివాసరావు చేతుల మీదుగా రైతులకు పచ్చిరొట్ట ఎరువులను అందించారు. అనంతరం వ్యవసాయాధికారి చంద్రావతి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు కావలసిన రైతులు తమ పేర్లను ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం జనుము 12 క్వింటాళ్లు, జీలుగ 17 క్వింటాళ్లు, పిల్లి పెసర 3 క్వింటాళ్లు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం సరఫరా చేసిన కొత్త రకం వేరు శనగ విత్తనాలను రైతులకు అందజేసినట్టు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు సంబంధిత అధికారులను సూచించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకుని, భూసారాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఏఎంసీ డైరెక్టర్ దలాయి రాము, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు కె.సీతారామయ్య, కావలి అప్పలరాజు, రొంగలి గంగరాజు, ఎస్.సన్యాసినాయుడు, ఎస్.అప్పలనాయుడు, వ్యవసాయ సహాయ విస్తరణాధికారి ఎం.ఎస్.మూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

దేవాలయం కేంద్రంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు


ఆధ్యాత్మిక ప్రచార కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పరవాడ: ప్రతి గ్రామంలో దేవాలయం కేంద్రంగా నెలకోసారి సామూహిక హారతి, ప్రతీ వారం భజన కార్యక్రమాలను నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు సూచించారు. ముత్యాలమ్మపాలెం ముత్యమాంబ ఆలయంలో గురువారం నిర్వహించిన ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భజన ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి స్టిక్కర్లు, కరపత్రాలను అందించాలన్నారు. గ్రామంలో అనారోగ్యంగా ఉన్న వారిని, ఆత్మీయ బంధువుల్ని గుర్తించి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాభివృద్ధి, అందరూ బాగుండాలని కోరుతూ గ్రామ ధార్మిక జట్టుతో గ్రామంలో హోమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వాసుపల్లి సోమశేఖర్, ఎ.కొండమ్మ, సూరాడ బోగమ్మ, ఎ.నూకమ్మ, కొండబాబు, నల్లయ్య, రామకృష్ణ, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు


పిల్లలకు పాలు, గుడ్లు అందిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం: 97వ వార్డు పరిధి శ్రమశక్తినగర్‌లోని ఘంటసాల ఆడిటోరియం వద్ద గురువారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కోచ్ శ్రీనివాసరావు పలు ఆటలను పిల్లలతో ఆడించారు. క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు పాలు, గుడ్లు పంపిణీ చేశారు. వార్డు పరిధిలోని బంగారమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శానాపతి శంకరరావు పాల్గొన్నారు.

29న బ్రాహ్మణ సామాజిక భవనం ప్రారంభం


బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో ద్రోణంరాజు శ్రీవాత్సవ్


సింహాచలం: సుజాతనగర్‌లో నిర్మించిన ద్రోణంరాజు బ్రాహ్మణ సామాజిక భవనాన్ని ఈ నెల 29న ప్రారంభించనున్నట్టు 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా తెలిపారు. బ్రాహ్మణ సామాజిక భవనంలో బ్రాహ్మణ సంఘాల సమాఖ్య ప్రతినిధి ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ఆధ్వర్యంలో పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు గురువారం సమావేశమై ప్రారంభ తేదీని ఖరారు చేశారు. ఈ నెల 29న విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్ చేతుల మీదగా సామాజిక భవనం ప్రారంభోత్సవం జరగనున్నట్టు రాపర్తి కన్నా తెలిపారు. బ్రాహ్మణులందరికీ ఉపయోగదాయకంగా సొంత భవనం చేకూరడం ఎంతో సంతోషంగా ఉందని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో ఉన్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు కావూరి చరణ్, మేడపాటి సుబ్బారావు, బాలసుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, గంప గాయత్రి, సుజాతనగర్ గాయత్రీ సేవా సంఘం సభ్యులు ఎస్.రమణమూర్తి, తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


శ్రీనివాసరావు(ఫైల్)

సింహాచలం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన 97వ వార్డు పరిధి చినముషిడివాడలో గురువారం చోటుచేసుకుంది. చినముషిడివాలో ఉంటున్న కాళ్ల శ్రీనివాసరావు(38) తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య ఇందిరాగౌరి, పిల్లలు మోనీష, గౌతమి ఉన్నారు. చినముషిడివాడలోని శ్రమశక్తినగర్‌లో ఈటి సీతం నాయుడు ఇంటిలో మెటార్ పనిచేయకపోవడంతో సీతం నాయుడు శ్రీనివాసరావుకి ఫోన్ చేశాడు. ఉదయం 6 గంటల సమయంలో సీతం నాయుడు ఇంటికి శ్రీనివాసరావు వెళ్లాడు. మోటర్ స్విచ్ ఆన్ చేయగానే మోటర్‌ని పట్టుకుని ఉన్న శ్రీనివాసరావు విద్యుత్ షాక్‌కు గురై క్రింద పడిపోయాడు. వెంటనే 108కి ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది అప్పటికే శ్రీనివాసరావు మృతిచెందినట్టు తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు


కరాసా వద్ద గెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ శ్రీధర్


నేతాజీనగర్ రహదారి గురించి కమిషనర్‌కు వివరిస్తున్న స్థానికులు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 52వ వార్డులో డిప్యూటీ మేయర్‌తో కలిసి పర్యటన

గోపాలపట్నం: పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దని సచివాలయ కార్యదర్శులకు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. 52వ వార్డులో గురువారం ఉదయం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి ఆయన పర్యటించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో కమిషనర్‌కు శ్రీధర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి రహదారులు, గ్రీన్ బెల్ట్‌ను పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్‌ను చూసి చాలా బాగుందని కొనియాడారు. ప్రధాన కాలువలు, ఇంజినీరింగ్ పనులతోపాటు దీర్ఘకాలంగా ఉన్న పాస్‌పోర్ట్ కార్యాలయం నుంచి కరాసాకు వెళ్లే ఎయిర్‌పోర్ట్ స్థలాల్లోని రహదారిని పరిశీలించారు. నేతాజీనగర్ రోడ్డును 80 అడుగులుగా అభివృద్ధి చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను స్థానికులు కోరారు. ఇక్కడి నుంచి కరాసా, గౌరీనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య పనులపై అలసత్వం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసే పనులు చేపట్టాలని ఆదేశించారు. డీఈ ఏడుకొండలు, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎ.రాజేష్ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్


అసకపల్లి ఎస్సీ కాలనీలో పింఛన్‌పై వృద్ధురాలిని అడుగుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


యర్రవానిపాలెంలో మహిళలకు ఓటీఎస్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: గ్రామాల్లోని ప్రతి సమస్యను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని అసకపల్లి శివారు యర్రవానిపాలెం, అసకపల్లి ఎస్సీ కాలనీలలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు అధ్వర్యంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనాన్ని గణాంకాలతో సహా వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అన్ని రకాల వసతులను దశలవారీగా కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. యర్రవానిపాలెంలో ఓటీఎస్ లబ్ధిదారులకు ఆయన చేతులమీదగా ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. గ్రామంలో మరమ్మతులకు గురై రెండు చేతిబోర్లు నిరుపయోగంగా మారినట్టు స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచినపుడు కొళాయిలు కూడా రాక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాంటి సమయంలో చేతిబోర్లే ఆధారంగా ఉండేవని, ఇపుడు అవికూడా అందుబాటులో లేవని మొరపెట్టుకున్నారు. దీంతో బోర్లను పరిశీలించి వెంటనే మరమ్మతు చేపట్టాల్సిందిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందును ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగన్ వెంట నడిచి, మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, బోను గంగునాయుడు, వద్దాది అప్పలరాజు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ మహేష్, పంచాయతీ ఏఈలు అర్జున అప్పారావు, శేఖర్, రామలక్ష్మణ, మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, సచివాలయ కన్వీనర్ కాపుశెట్టి నీలమణి, పార్టీ నాయకులు బోను గంగునాయుడు, ఉప సర్పంచ్ కరణం సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేను కలిసిన బీఎంఎస్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ బీఎంఎస్ నాయకులు కోరారు. గురువారం నాయకులు స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను కలిసి కార్మికుల సమస్యల గురించి చర్చించారు. కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాల్సిన అవసరం గురించి వివరించారు. ప్లాంట్ అభివృద్ధికి బీఎంఎస్ పూర్తి సహకారం అందిస్తుందని, అదే విధంగా ప్రభుత్వ సహకారం కోసం కేంద్ర మంత్రులను కలిసి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎంలు బినయ్‌ప్రసాద్, కె. సంజీవరావు, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్. నాయుడు, జిల్లా కార్యదర్శి రాందాస్ నరేంద్ర, కొమ్మినేని శ్రీనివాస్, హరీష్ వర్మ, శేషగిరిరావు, కె. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టేందుకే ప్రైవేటీకరణ'


833వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని, ఉక్కు ఉత్పత్తిని నిలిపేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 833వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణను ఆపాలని, సంస్థను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.